


# కరపత్రం

SINCE 2014

ఆదివారం ఏప్రిల్ 27 2025 | సంపుటి :0 | సంచిక :195 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# అన్ని వర్గాల ఆకాంక్షలు

## నెరవేర్చడమే మా లక్ష్యం: రేవంత్ రెడ్డి

**సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.**



- రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.12 వేలు అందిస్తున్నట్లు చెప్పారు.
- వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
- రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు.
- ప్రజలకు అవసరమైన విషయాలు సరిగ్గా అర్థం చేసుకునే సామర్థ్యం కాంగ్రెస్‌కు ఉంది అని రేవంత్

హైదరాబాద్: సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. " రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు" రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం- వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి.



### రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి: రాహుల్ గాంధీ

- హైదరాబాద్: గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు.

2లో

### డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



- అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు.
- దరఖాస్తు గడువు వచ్చే నెల 5వ తేదీ వరకు.
- ఇతర వివరాలకు 8309037134 నెంబరును సంప్రదించవచ్చు.

ఉస్మానియా యూనివర్సిటీ : దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మహిళా సభ వొకేషనల్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్ కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్,

2లో



### పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు

**పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.**

హైదరాబాద్: పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంసీహెచ్ఆర్‌డీలో నిర్వహించిన 'రోజ్‌గార్ మేళా'లో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 100 మందికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని చెప్పారు.

# రేపటిలోగా వెళ్లిపోండి..

### హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు నోటీసులు

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ ఆదేశాలతో పలు రాష్ట్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థానీయులను గుర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న నలుగురు పాక్ పౌరులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. వీరు షార్ట్ టర్మ్ వీసాలతో ఉంటున్నట్లు గుర్తించారు. రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు గుర్తించారు.

### తెలంగాణలో ఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్



2లో

హైదరాబాద్: హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కోరారు. లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు.

### తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా?:




2లో

హైదరాబాద్: కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. "తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళ్లు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారు" అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# భారాస 10 ఏళ్లలో సాధించలేదని..

## ఏడాదిన్నరలో సాధించాం: ఉత్తమ్ కుమార్

- కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.
- ఇంత భారీ మొత్తం వృథా చేస్తే ఇతర దేశాల్లో కఠిన శిక్షలు పడేవని అన్నారు.
- వేల కోట్ల అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టినా, అవి నిరుపయోగంగా మారాయని పేర్కొన్నారు.
- అయినా యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని తెలిపారు.
- సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.



కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

2లో

### విద్యార్థిగా పాక్‌కు వెళ్లి.. ఉగ్రవాదిగా తిరిగొచ్చి: పహల్గాం ఉగ్రవాది ఉదంతమిది..!

- పహల్గాం ఉగ్ర దాడిలో కీలక నిందితుడైన ఆదిల్ హుస్సేన్ థోకర్ గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.



2లో

### గుజరాత్‌లో భారీ ఆపరేషన్.. 1000 మంది అక్రమ వలసదారులు అదుపులోకి..!

- మన దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న 1000 మందికి పైగా బంగ్లాదేశీ వలసదారులను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



2లో

### ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం.. పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం

- జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతాదళాలు ధ్వంసం చేశాయి.



2లో

# రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న ఇంటలిజెన్స్ అధికారి





**మెట్ పల్లి ఏప్రిల్ 26 కరపత్రం ప్రతినిధి**

మెట్పల్లి పట్టణంలోని శ్రీ వెంకట ఆలేఖ్య నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్న రాధ అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఒ పాజిటివ్ రక్తం అవసరం అని ఎనుగందుల ఉదయ్ కుమార్ ని సంప్రదించగా మెట్పల్లి పోలీస్ ఇంటలిజెన్స్ లో విధులు నిర్వహిస్తున్న కోయల్కర్ రమేష్ ని సంప్రదించగా రమేష్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది.అత్యవసర సమయంలో రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న కోయల్కర్ రమేష్ ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులు, రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్,యువజన సంఘాల సభ్యులు, పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

# వేముగల్లు ప్రాచీన చరిత్రకు చిరునామా నందీశ్వరాలయం

**- కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్, రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడి**



**నిజామాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 26 కరపత్రం ప్రతినిధి**

చరిత్ర క్షేత్ర సందర్శనలో భాగంగా శుక్రవారం కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు, చరిత్రకారుడు కంకణాల రాజేశ్వర్ శుక్రవారం నందీశ్వరాలయాన్ని సందర్శించి ఆలయ ప్రాంగణంలో గల ప్రాచీన శిల్పాల చిత్రాల్ని పరిశీలించారు. తదుపరి తమ పరిశోధన కందని ఎన్నో ఛాయాచిత్రాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం రాష్ట్ర కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ద్వారా పలు కొంగ్రొత్త చారిత్రక విషయాలనె న్నింటినో పరిష్కరించారు. తదనంతరం కంకణాల రాజేశ్వర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ... నంది పీఠం పైన కాకతీయ శైలి నంది, కాకతీయానంతర శైలిలో గల దుర్గాదేవి, చాళుక్య శైలి లక్ష్మి,6 అడుగుల ఎత్తైన ఒక శివలింగం, 6 అడుగులకు మించి ఎత్తైన రాష్ట్ర కూట శైలి లలితాసన గణపతి విగ్రహం, కాకతీయ శైలి మంట స్తంభాలు, కొట్టేసిన రావి చెట్టుకు ఆనుకొని ఉన్న నాగ ప్రతిమలు, చాళుక్య శైలి కాలభైరవుడు, వర్తులాకార పానవట్టం లో చత్ర శిరోవర్తనంతో కూడిన శివలింగం, నంది, నాగ విగ్రహాలు, అక్షరాలు చెరిగిపోయిన శిలా శాసనాలున్నా యి. పంచముఖ అభయాంజనేయ శిల్పం ప్రత్యేకం.16వ శతాబ్దపు శైలి, మరో రెండు భక్తాంజనేయ శిల్పాలు, శంకర దాసమయ్య ఆలయ సమీపాన రాష్ట్ర కూట శైలి వీరగల్లు విగ్రహం కనుగొనబడ్డదని అన్నారు. శివాలయంలో లభించిన శాసనం 11వ శతాబ్ధాని దన్నారు. ఇటీవల ప్రచురించిన తెలంగాణ వారసత్వ శాఖ 'నిజామాబాద్ శాసన సంపుటి' లో భీంగల్ శాసనాలు రెండు ఉన్నాయని అన్నారు. ఇలాంటి అరుదైన శిల్ప సంపదను, శాసనాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

# గుజరాత్‌లో భారీ ఆపరేషన్.. 1000 మంది అక్రమ వలసదారులు అదుపులోకి..!

మొదటిపేజీ తరువాయి

అహ్మదాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. వలసదారులపై ప్రత్యేక నిఘా పెట్టాయి. ఈ క్రమంలోనే గుజరాత్‌లో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 1000 మందికిపైగా బంగ్లాదేశీ అక్రమ వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తప్పుడు ధ్రువపత్రాలతో రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు.

శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాష్ట్రంలోని పలు నగరాల్లో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగానే అహ్మదాబాద్‌లో 890 మందిని, సూరత్‌లో 134 మందిని అదుపులోకి తీసుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వీరంతా పశ్చిమ బెంగాల్‌లో సరిహద్దులు దాటి భారత్‌లోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. అక్కడ ఫోర్జరీ పత్రాలు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిపారు.

విద్యార్థిగా పాక్‌కు వెళ్లి.. ఉగ్రవాదిగా తిరిగొచ్చి: పహల్గాం ఉగ్రవాది ఉదంతమిది..!

"వీరిలో చాలా మంది డ్రగ్స్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అనుమానితులుగా ఉన్నారు. ఇటీవల నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేయగా.. వారిలో ఇద్దరు అల్‌ఖైదా స్లీపర్ సెల్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లుగా గుర్తించాం. ఈ క్రమంలోనే తాజాగా భారీ ఆపరేషన్ చేపట్టాం. వీరందరి పత్రాలను పరిశీలించిన తర్వాత.. త్వరలోనే దేశం నుంచి పంపిస్తాం" అని హర్ష్ సంఘవి వెల్లడించారు. ఇక, రాష్ట్రంలో పాక్ జాతీయులు ఎవరైనా ఉంటే.. కేంద్రం తీసుకున్న నిబంధనల ప్రకారం వారు కూడా వెంటనే గుజరాత్‌ను వీడాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేకంగా దేశంలో ఉండే వారిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ వలసదారులు వెంటనే పోలీసులకు లొంగిపోవాలని సూచించారు.

# విద్యార్థిగా పాక్‌కు వెళ్లి.. ఉగ్రవాదిగా తిరిగొచ్చి: పహల్గాం ఉగ్రవాది ఉదంతమిది..!

మొదటిపేజీ తరువాయి

చదువుకోవాల్సిన వయసులో అతివాద భావజాలానికి ప్రేరేపితుడయ్యాడు. చదువు పేరుతో పొరుగుదేశం వెళ్లి ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. తిరిగొచ్చి సొంత గడ్డపైనే అకృత్యాలకు పాల్పడ్డాడు. పహల్గాం లో పర్యాటకులకు మరణ శాసనం రాసిన ఉగ్రవాది ఆదిల్ హుస్సేన్ థోకర్ ఉదంతమిది.

**విద్యార్థిగా వెళ్లి..**

20 ఏళ్ల ఆదిల్ థోకర్‌ది అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాకు సమీపంలోని గురీ అనే చిన్న గ్రామం. టీనేజ్‌లో ఉండగానే పలు నిషేధిత ఉగ్ర సంస్థలకు చెందిన ముష్కరులకు దగ్గరగా మెదిలాడు. 2018లో దక్షిణ కశ్మీర్‌లో జరిగిన ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడు. అదే ఏడాది పాక్ నుంచి విద్యార్థి వీసా సాధించి వాఘా సరిహద్దు దాటాడు. ఆ తర్వాత బాహ్య ప్రపంచానికి కన్పించకుండా పోయాడు. దాదాపు 8 నెలల పాటు కుటుంబంతోనూ మాట్లాడకుండా అజ్ఞాతంలో గడిపాడు. అతడిపై ఇంటలిజెన్స్ ఏజెన్సీలు నిఘా పెట్టినా ఏ ఫలితం లేకపోయింది. అయితే, ఆ సమయంలో అతడు లష్కరే తోయిబా సంస్థలో చేరినట్లు ఆ తర్వాత నిఘా వర్గాలు గుర్తించాయి. 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో శిక్షణ తీసుకొని టాప్ కమాండర్ల పక్కన పని చేసినట్లు తెలిపాయి.

**గతేడాది అక్రమంగా దేశంలోకి తిరిగొచ్చి..**

2024 చివర్లో ఆదిల్ భారత్‌కు తిరిగొచ్చాడు. అయితే, అధికారిక మార్గాల్లో కాదు. పూంఛ్-రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణ రేఖను దాటి అక్రమంగా చొరబడ్డాడు. అతడి వెంట ముగ్గురు, నలుగురు పాక్ జాతీయులు కూడా వచ్చినట్లు నిఘా వర్గాల సమాచారం. ఈ సెక్టార్‌లో గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం ఉండటంతో పెట్రోలింగ్ చేయడం కష్టమైనది. అది అనువుగా తీసుకుని ఆదిల్ ఆ సరిహద్దు గుండా దేశంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అతడి వెంట ఉన్న వారిలో హాషీమ్ ముసా అలియాస్ సులేమాన్ కూడా ఉన్నాడు. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో సులేమాన్ కూడా ఒకడు.

**అండర్‌గ్రౌండ్‌లో ఉంటూ..**

సరిహద్దు నుంచి తన స్వస్థలానికి చేరుకొనే సమయంలోనూ ఆదిల్ నిఘా ఏజెన్సీలకు చిక్కకుండా చాలా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. అనంత్‌నాగ్‌లో అతడు అండర్‌గ్రౌండ్‌లో దాక్కొన్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సమయంలో ఓ పాక్ జాతీయుడికి కూడా ఆశ్రయం ఇచ్చాడు. కొన్ని వారాల పాటు స్థానిక టెర్రరిస్ట్ సెల్స్‌తో నిరంతరం సంప్రదింపులు జరిపి పహల్గాం దాడికి కుట్ర రచించినట్లు తెలిసింది.

**దాడికి పాల్పడిందిలా..**

అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా భారీ కుట్రకు ఆదిల్ ప్లాన్ చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం అనువైన ప్రదేశం కావాలని స్థానిక ఉగ్ర విభాగాలతో అతడు చర్చించినట్లు సమాచారం. తొలుత రద్దీగా ఉండే టూరిస్టు ప్రదేశాలను ఎంచుకోవాలని అనుకున్నాడు. అయితే, భద్రతా బలగాలకు సవాలుగా ఉండే బైసరన్ లోయ అయితే తప్పించుకునేందుకు వీలు ఎక్కువగా ఉంటుందని దాన్ని ఎంచుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

ఏప్రిల్ 22, మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆదిల్ సహా కొంతమంది ఉగ్రవాదులు దట్టమైన పైన్ అడవులను దాటుకుని బైసరన్ పచ్చికబయళ్లను చేరుకున్నారు. ఎం-4 రైఫిళ్లు, ఏకే 47 తుపాకులతో పర్యాటకులను చుట్టుముట్టారు. పేర్లు అడిగి మరీ అతి సమీపం నుంచి వారిపై కాల్పులు జరిపారు. అనంతరం అంతే వేగంగా అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆదిల్‌తో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను పోలీసులు విడుదల చేశారు. వీరి ఆచూకీ చెప్పినవారికి రూ.20లక్షల రివార్డు ప్రకటించారు. ముష్కరుల కోసం అనంత్‌నాగ్, పహల్గాం, చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

# పర్యాటకం, ఆతిథ్యరంగానికి ఊతమిచ్చేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




పర్యాటకం, ఆతిథ్యరంగానికి ఊతమిచ్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బార్ల లైసెన్సు ఫీజు, నాన్ రింఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించింది.

అమరావతి: పర్యాటకం, ఆతిథ్యరంగానికి ఊతమిచ్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బార్ల లైసెన్సు ఫీజు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించింది. ఏడాదికి బార్ల లైసెన్స్ ఫీజును రూ.5 లక్షలుగా నిర్ధరించింది. 3 స్టార్, పైస్థాయి హోటళ్లలో రిజిస్ట్రేషన్ ఛార్జీని రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు కుదించింది. నాన్ రిఫండబుల్ ఛార్జీని రూ.20 లక్షలుగా నిర్ధరించింది. ఫీజులు తగ్గించాలన్న హోటల్స్ అసోసియేషన్ విజ్ఞప్తి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్టార్ హోటళ్లు ఉన్నచోట బార్ లైసెన్స్‌ల జారీపై నియంత్రణ లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

# రాజకీయాల్లోకి కొత్త తరం రావాలి: రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు.

# భారాస 10 ఏళ్లలో సాధించలేదని.. ఏడాదిన్నరలో సాధించాం: ఉత్తమ్ కుమార్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం నాసిరకం పనులతో ప్రాజెక్టులను నాశనం చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకూ ప్రమాదం పొంచి ఉందని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, ఇంత మొత్తంలో వృథా చేస్తే ఇతర దేశాల్లో పెద్ద శిక్షలు పడేవన్నారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.

"రూ.వేల కోట్లు అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టారు. కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా అత్యధిక పంట పండింది. యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది. తాజాగా సీతారామసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఏడాదిన్నరగా మేం చేసిన కృషి ఫలించింది. తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు. దశాబ్దకాలంగా భారాస సాధించలేనిది.. మేం ఏడాదిన్నరలోనే సాధించాం. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరం. ఈ రెండు ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేస్తాం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# డీడీఎంఎస్‌లో వివిధ వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత పదవతరగతి అని వివరించారు.

రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, పర్ఫ్యూజన్ టెక్నీషియన్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చే నెల 5వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8309037134 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

# తెలంగాణలో ఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

కలుషితాహారం కారణంగా మరణించిన గురుకుల విద్యార్థుల కుటుంబాలను, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కలవాలన్నారు. కూలిపోయిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, ఫోర్త్ సిటీ, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన అశోక్ నగర్‌ను సందర్శించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన వినాశనం గురించి వినడానికి మీకు 'అద్భుతమైన' సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం.. పెద్దఎత్తున ఆయుధాలు స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి తర్వాత ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతాదళాలు గుర్తించి.. ధ్వంసం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఉగ్రస్థావరాలు ఉన్నాయని నిర్దిష్ట నిఘా వర్గాల సమాచారం మేరకు.. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని సెడోరి నాలా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు సోదాలు నిర్వహించాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించాలనే లక్ష్యంతో ముష్కరులు కుట్రపన్నుతున్నారని సమాచారం వచ్చిందని.. ఈ సమయంలో సైన్యం వారి స్థావరాలను ధ్వంసం చేయడం ఉగ్రవేటలో మరో ముందడుగని అన్నారు.

పహల్గాం ఉగ్రదాడిలో పౌరులు ప్రాణాలు కోల్పోవడంతో భారత ప్రభుత్వం ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపుతోంది. నాటి నుంచి భద్రతా దళాలు వారి ఆచూకీ కోసం రాష్ట్రం అంతటా జల్లెడపడుతున్నారు. మరోవైపు కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తున్న ఇద్దర్ని భద్రతా దళాలు శనివారం అరెస్టు చేశాయి. ఖైమోహ్ ప్రాంతంలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అయితే, వారి పేర్లు, ఇతర వివరాలను భద్రతా సిబ్బంది వెల్లడించలేదు.

# పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు

మొదటిపేజీ తరువాయి

పహల్గాం ఘటన ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. భిక్షమెత్తుకునే దుస్థితికి చేరినా పాక్ బుద్ధి మారడం లేదన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న భారత్‌ను చూసి ఓర్వలేకపోతోందని విమర్శించారు. ప్రధాని మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అంతా అండగా నిలవాలన్నారు. రోజ్‌గార్ మేళాలో కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు బండి సంజయ్ అభినందనలు తెలిపారు. ఇష్టపడి పనిచేసి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు చిట్టచివరి వ్యక్తికి కూడా అందేలా చేయాలన్నారు.

# వరంగల్ లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సర్వం సిద్దం.

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ జిల్లా ఏప్రిల్ 26**

1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ ఏర్పాట్లు
154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం
500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక
1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు
10 లక్షల వాటర్ బాటిళ్లు
16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
వివిధ రూట్లలో 6 అంబులెన్స్‌లు
పరిసరాల్లో 12 వైద్య శిబిరాలు
1,200 తాత్కాలిక మరుగు దొడ్లు
పార్కింగ్ నిర్వహణకు 2,000 మంది వాలంటీర్లు



తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్ పార్టీకి 25 సంవత్సరాలు నిండాయి. 2001లో ఏర్పడి 2014లో రాష్ట్రాన్ని సాధించే దాకా పుట్టిన గడ్డ విముక్తి కోసం లెక్కలేనన్ని పోరాటాలు చేసిన బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన తరువాత పదేండ్ల పాటు సుపరిపాలన అందించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది. 17 నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కేవలం 2.05% ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, స్వల్ప కాలంలోనే ప్రజాగ్రహానికి గురైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా పదిహేడు నెలల నుంచి అద్భుతంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. లగచర్లలో గిరిజన రైతులపై కాంగ్రెస్ చేసిన దాష్టీకాలను యావత్ దేశం దృష్టికి తీసుకుపోవడంలో బీఆర్ఎస్ విజయవంతం అయింది. మూసీ, హైడ్రా బాధితులకు అండగా నిలబడింది. మొన్నటి హెచ్?సీయూ విద్యార్థుల పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి 400 ఎకరాల పచ్చటి అటవీ భూమిని కాపాడుకుంది. అక్కడి వన్యప్రాణులకు నిలువ నీడ లేకుండా చేయాలనుకున్న రేవంత్ ప్రభుత్వ దమనకాండను దేశం ముందుంచింది. త్యాగాల పునాదుల మీద అవతరించిన తెలంగాణను ఖతం పట్టించాలనుకుంటున్న కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కుంటూనే తన 25 ఏండ్ల రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ రెడీ అయింది. తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఏర్పడిన తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించబోతున్నారు. లక్షలాదిగా తరలివచ్చే జనానికి, అందుకు తగ్గట్టుగానే తాత్కాలిక వసతి సౌకర్యాలు సిద్ధమయ్యాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన 1,213 ఎకరాల్లో రజతోత్సవ సభ కోసం బీఆర్ఎస్ పార్టీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. మహాసభ ప్రాంగణాన్ని 154 ఎకరాల్లో సిద్ధం చేసింది. 500 మంది కూర్చునేలా గులాబీ రంగులతో వేదికను తీర్చిదిద్దారు. వేదిక పక్కనే కళాకారుల ఆట-పాట కోసం ప్రత్యేకంగా మరో స్టేజ్ ను ఏర్పాటుచేశారు. ఇక ఎల్కతుర్తికి వచ్చే అన్ని రోడ్డు మార్గాల్లో చెత్తను, ముళ్ళచెట్లను తొలగించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రతి రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి చదును చేశారు. ఇక సభకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి దాదాపు 50 వేల వాహనాల వస్తాయని అంచనా వేస్తున్నారు. పార్కింగ్ కోసం 1,059 ఎకరాలను కేటాయించారు. వీఐపీ వాహనాల కోసం సభావేదిక ఎడమ భాగం, వెనుక భాగంలో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్షకు పైగా కుర్చీలను ఏర్పాటు వేశారు. మహిళల కోసం ప్రత్యేక కుర్చీలు వేసి బారికేడ్లు పెట్టారు. లైట్లు, ఎల్ఈడీల కోసం 200 భారీ జనరేటర్లను ఏర్పాటుచేశారు. కేసీఆర్ అందరికీ స్పష్టంగా కనిపించేలా 20/50 సైజుతో కూడిన 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, భారీ సౌండ్ సిస్టంను చుట్టుపక్కల ఏర్పాటుచేశారు.

# శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం

**- పెద్దపల్లి డీసీపీ కర్ణాకర్**
**- జవహర్ లాల్ స్టేడియంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టిస్**









**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండము గోదావరిఖనిలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియం గ్రౌండ్ లో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ గోదావరిఖని వన్ టౌన్, రామగుండం సర్కిల్ సివిల్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కు పెద్దపల్లి డిసిపి కర్ణాకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి డీసీపీ గారు వివరించారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది..? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు..? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు డీసీపీ చెప్పారు. మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జ్ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ ఎస్ఐ శివ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రఫీ లు సివిల్ సిబ్బందితో ప్రాక్టిస్ చేపించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, రవీందర్ రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, గోదావరిఖని సబ్ గోదావరిఖని ఎస్ఐ రమేష్, భూమేష్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్ఐ సంధ్య రాణి, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఆర్ఎస్ఐ శివ కుమార్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పౌర హక్కుల సంఘం ప్రజా సంఘాలు... ఆధ్వర్యంలో హనుమకొండలోని వరంగల్ ప్రెస్ క్లబ్ లో ప్రొఫెసర్ హరగోపాల్ మీడియా సమావేశం....




**- ప్రొఫెసర్ హరగోపాల్ కామెంట్స్**

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ ఏప్రిల్ 26.**

ఛత్తిస్ ఘడ్ తెలంగాణ సరిహద్దులలోని కర్రేగుట్ట లో కాల్పులను కేంద్రం ప్రభుత్వం నిలిపి వేయాలి మధ్య భారతంలో ఆదివాసుల హననాన్ని ఆపాలి ప్రజాస్వామ్య, రాజ్యాంగం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి...దేశం లో శాంతి యుత వాతావరణం... ఏర్పాటు కు కేంద్రం చర్చలు జరపాలి...విప్లవ పార్టీలు, ప్రభుత్వా ల మధ్య చర్చలు... జరిగితే... అందరికీ ఉపయోగకరం...మావోయిస్టు, కేంద్రం మధ్య జరుగుతున్న పోరాటంలో... ఆదివాసీలు బలి అవుతున్నారు....బ్రిటిష్ కాలం నుంచి మావోయిస్టు పార్టీ ఉన్నది...ఆదివాసి ప్రజలు భయానక వాతావరణం లో ఉన్నారు...స్మశానంలో చర్చలు జరపాలని కేంద్రం అనుకుంటున్నది... పోరాటం చేస్తున్న వారి తో శాంతి చర్చలు జరపాలి...మావోయిస్టు పార్టీ లేఖ లు రాసినప్పటిక్కీ కర్రే గుట్ట ను వేలాది మంది తో ముట్టడించడం సరికాదు... యుద్ధం అపాలని... సమాజ కోరిక మేరకు కేంద్రం ముందుకు రావాలి...

# అంగన్ వాడీలో గ్రాడ్యుయేషన్ డే

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**




గోదావరిఖని జవహార్ నగర్ సెక్టార్ విఠల్ నగర్ లోని అంగన వాడి కేంద్రంలో ఈసీసీఈ డే సంధర్భంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అలేఖ్య, సూపర్ వైజర్ షీరీన్, ఉపాధ్యాయులు కె.శోభారాణి - జవహర్ నగర్ -5, ఎం.నిర్మల సబ్ సెంటర్ ఏరియా-6, శ్రీలత పరుశురాం నగర్, ఇ.సుజాత - విట్టల్ నగర్ 1-(1), హెల్పర్స్ స్వప్న, తిరుమల, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీలోని స్థలం కబ్జా చేసిన కబ్జాదారులపై, చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

**- బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం.**




**కరపత్రం ప్రతినిధి బెల్లంపల్లి ఏప్రిల్ 26 :**

బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల గ్రామ శివారులో జాతీయ రహదారి ప్రక్కన జర్నలిస్టుల కాలనీ కోసం కేటాయించిన స్థలంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల ప్లాటింగ్ చేసి, నిర్ణీత కొలతల ప్రకారం ప్లాట్లుగా విభజించి, సిమెంట్ పోల్స్, పాతి కబ్జా చేస్తున్న వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారుకూరి సదానందం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జర్నలిస్టు కాలనీ స్థలాన్ని సభ్యులతో శనివారం పరిశీలించిన అనంతరం, ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు, కన్నాల గ్రామ శివారు సర్వే నంబర్ 144 నుండి 148 వరకు మరియు 185,186,211, ఉన్న ఐదున్నర ఎకరాల స్థలం పూర్తిస్థాయిలో ప్లాట్లుగా చేయడం, స్థానిక జర్నలిస్టులు ఎవరికి సమాచారం లేకపోవడం విస్మయానికి గురి చేస్తుందని అన్నారు.

ఆ స్థలంలో పట్టణంలో పాత్రికేయ వృత్తిని కొనసాగిస్తున్న అర్హులైన జర్నలిస్టుల్లో, సీనియార్టీ ప్రాతిపదికన ఉన్నవారితో పాటు అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు సైతం ఆ కాలనీలో, స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించేలా, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ తోపాటు ఆర్డీవో హరికృష్ణ,తాసిల్దార్ జోష్న, లు దృష్టి సారించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థలాన్ని కబ్జా చేసిన విషయమై స్థానిక ఆర్డిఓ హరికృష్ణను ఎమ్మార్వో జోష్నను, వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. జర్నలిస్టుల కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో,ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ పాండే, ఉపాధ్యక్షులు దండ బోయిన భాస్కర్, కత్తుల నవీన్, శ్రావణ్, సాగర్,రాకేష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మిక కుటుంబానికి10 పదివేల రూపాయల ఆర్థిక సాహాయం.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 26**



జమ్మికుంట మండలం తనుగుల గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ పైడిపల్లి సమ్మయ్య అను కార్మికుడి తల్లి మరణించినందున, శనివారం రోజున ఆయన ఇంటికి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మరియుమండల గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు వెళ్లి పరామర్శించి జమ్మికుంట మండల యూనియన్ సహకారంతో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏండిగా రవీందర్రావు, లద్దనూరు కుమార్ కమిటీ సభ్యులు కోశాధికారి, మేక మల్ల రాము, సమ్మయ్య చేతికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పేరుగు అశోక్, ఆసాల సారయ్య, కమిటీ సభ్యులు, రాచపల్లి మొగిలి, రవి, భద్రయ్య, సంపత్, సతీష్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.